పోలీసులపై ఉన్మాది దాడి

- ఎస్‌ఐను కలవాలంటూ రాత్రి స్టేషన్‌కు వచ్చిన ఆగంతకుడు
- ఎస్‌ఐ లేడని తెలిపిన హెడ్ కానిస్టేబుల్‌పై కత్తితో దాడి
- అడ్డుకునేందుకు యత్నించిన హోమ్‌గార్డుపై సైతం దాడి
- బాధితులిద్దరిని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలింపు



చికిత్స నిర్వహిస్తున్న ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి డా.శ్రీకాంత్



గాయపడ్డ హోమ్‌గార్డు గిరి

కుభీర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుభీర్ పోలీసుస్టేషన్‌లో గురువారం రాత్రి విధుల్లోనున్న హెడ్ కానిస్టేబుల్ నారాయణ, హోమ్‌గార్డు గిరిలపై ఆగంతుడొకరు కత్తితో జరిపిన దాడి కలకలం రేపింది. రాత్రి 9.30 ప్రాంతంలో మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా భావిస్తున్న అగంతకుడు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఎస్‌ఐ కృష్ణారెడ్డి గదివైపు వెళ్లాడు. ఇది గమనించిన హెడ్ కానిస్టేబుల్ నారాయణ ఆగంతకుడిని లోనికి వెళ్లకుండా అడ్డుకొని ఎవరు కావాలి,ఎందుకు వచ్చావంటూ ప్రశ్నిస్తూ లోనికి రాకుండా నివారించాడు.దీంతో అతను తన వద్దనున్న కత్తితో హెడ్ కానిస్టేబుల్ నారాయణపై దాడికి దిగి గాయపరిచాడు. దీంతో ఆయన కేకలు వేయగా లోపలి గదిలోనున్న హోమ్ గార్డు గిరి ఆగంతకుడిని అడ్డుకునేందుకు యత్నించాడు. దీంతో ఆగంతకుడు అదే కత్తితో హోమ్ గార్డుపై సైతం దాడికి పాల్పడ్డాడు.వీరిద్దరు అరుపులు, కేకలు వేయడంతో అక్కడి ప్రాంతంలో ఉన్న కానిస్టేబుళ్లు పరుగున పోలీసు స్టేషన్‌కు తరలివచ్చారు. వీరిని చూసి అగంతకుడు కత్తిని తీసుకొని అక్కడి నుంచి పారిపోయాడు. ఆగంతకుడిని పట్టుకునేందుకు కానిస్టేబుళ్లు వెంబడించినప్పటికిని వారికి చిక్కకుండా పారిపోయాడు.కత్తి దాడి ఘటన సమాచారం అందుకున్న కుభీర్ ఎస్‌ఐ కృష్ణారెడ్డి పోలీసు స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలుసుకొని బాధిత పోలీసు సిబ్బందిని వెంటనే ప్రైవేట్ వాహనంలో చికిత్స కోసం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆగంతకుడిని పట్టుకునేందుకు గాను గాలింపు చర్యలు చేపట్టారు. సంబంధిత సమాచారం అందుకున్న భైంసా రూరల్ సీఐ నైలు ఘటనా స్థలికి చేరుకొని విచారణ చేపట్టారు.ఘటనకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

ఆలయ భూములు హాంఫట్..

- దేవాదాయ శాఖ భూములు యథేచ్ఛగా ఆక్రమణలు
- కబ్జా జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

దేవాదాయ శాఖ ఆధీనంలో ఉండాల్సిన భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో దాదాపు అన్ని ప్రముఖ దేవాలయాల్లో రూ.కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమైనవని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సైతం ఈ విషయాన్ని ధృవీకరిస్తూ పలు భూములు వివాదమై కోర్టు కేసుల్లో ఉన్నాయని వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంటున్నారు.



బాసర సరస్వతి అమ్మవారి మూర్తి

నిర్మల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలోని భూములు యథేచ్ఛగా కబ్జాల పాలవుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. జిల్లాలోని చారిత్రక దేవాలయాలకు సంబంధించిన భూములను కొంతమంది పలుకుబడి పరపతి గల వ్యక్తులు తమకున్న రాజకీయ అండదండలతో యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు చెబుతున్నారు. మరికొంతమంది ఏకంగా దేవాదాయ శాఖ భూములకు సంబంధించిన రికార్డులను తారుమారు చేసి తమ పేరిట పట్టాలు చేసుకున్నట్లు సైతం విమర్శలున్నాయి. సంబంధిత శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. దేవాలయాల భూములనే కాకుండా వీటికి సంబంధించిన రికార్డులను సైతం రక్షించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ దిశగా ఆశించిన చర్యలు జరగకపోవడం చర్చకు తావిస్తోంది. జిల్లాలో మొత్తం 273 దేవాలయాలుండగా ఈ దేవాలయాల పరిధిలో దాదాపు 1472 ఎకరాల భూములున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందులో నుంచి చాలా ఎకరాల వరకు పరాధీనంలో ఉన్నాయని ఆయా దేవాలయాల పరిధిలోని గ్రామాల భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పష్టమైన రికార్డుల ఆధారంగా ఆక్రమణలో ఉన్న భూములను న్యాయ పరంగా స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాసర ఆలయ పరిధిలో..

బాసరలో ప్రసిద్ధ సరస్వతీ పుణ్యక్షేత్రంతో పాటు ట్రిపుల్ ఐటీ ఉన్న కారణంగా ఇక్కడి భూములకు ఎక్కువ డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకున్న అక్రమార్కులు కొంతకాలం నుంచి బాసర ఆలయభూములను అన్యాక్రాంతం చేస్తూ వస్తున్నారు. ఆలయానికి సంబంధించి మొత్తం 16 ఎకరాల భూమి అన్యాక్రాంతమైనట్లు ఆరోపణలున్నాయి. బాసరలోనే కాకుండా సమీపంలోని మహారాష్ట్రలో కూడా ఈ ఆలయానికి భూములున్నట్లు చెబుతున్నారు. అయితే కొంతమంది ప్రముఖవ్యక్తుల అండదండలతో బీనామీలు ఈ భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి తమ పేరిట తప్పుడు రికార్డులను సృష్టించుకోవడమే కాకుండా ఆ భూములను తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బాసరను మాస్టర్‌ప్లాన్ కింద పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామంటూ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే 16 ఎకరాల భూమి కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లయితే అభివృద్ధి పనులకు ఈ భూమి ఎంతో తోడ్పడనుంది.



అన్యాక్రాంతమైన కుబీర్‌లోని విఠలేశ్వర ఆలయ భూములు

విఠలేశ్వర స్వామి ఆలయంలో..

కుభీర్ మండలంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి దాదాపు 22.3 ఎకరాల భూములు అక్రమార్కుల కబ్జాలో సాగవుతున్నాయి. అయితే ఈ ఆలయానికి సంబంధించిన మరో ఆరుఎకరాలకు పైగా భూములు పరాధీనంలో ఉన్నట్టు చెబుతున్నారు. ఈ ఆలయం జిల్లాలోనే చారిత్రక ప్రసిద్ధి చెందినది.

అడెల్లి భూములు సైతం....

అడెల్లి మహాపోచమ్మ దేవాలయ పరిధిలో 7.36 ఎకరాల భూమి ప్రస్తుతం ఉంది. ఈ భూమిలో షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు ఆలయం ఎదుట ఖాళీ స్థలం కూడా పరిగణలో ఉంది. కాగా ఈ ఆలయానికి సంబంధించి 1.28 ఎకరాల భూమి అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదులున్నాయి. గతంలో కొంతమంది భక్తులు ఆలయానికి విరాళంగా ఇచ్చిన భూముల్లో ప్రభుత్వం మొక్కలను నాటింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ సహకారంతో గతంలో విరాళంగా ఇచ్చిన భూములకు బినామీ రైతుల పేరిట రికార్డులను సృష్టించడమే కాకుండా ఆ భూముల నుంచి చెట్లను తొలగించిరు. ఈ భూములను ఇతరులకు విక్రయించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉదాసీమఠం భూములపై చర్యలు కరువు

నిర్మల్ జిల్లా కేంద్రంలోని నడిబొడ్డున ప్రియదర్శిని నగర్‌లోని ఉదాసీమఠానికి సంబంధించిన భూములకు రక్షణ కరువైందని అంటున్నారు. ఇప్పటికే ఈ భూములను కొంతమంది ఆక్రమించడంతో వారికి నోటీసులు జారీచేసినప్పటికీ చర్యలు కరువయ్యాయని అంటున్నారు. ఈ భూములను రక్షించేందుకు దేవాదాయ శాఖ కోర్టును సైతం ఆశ్రయించింది. ప్రస్తుతం ఈ భూముల వ్యవహారం దేవాదాయ ట్రిబ్యునల్‌లో కూడా ఉన్నట్లు చెబుతున్నారు. దాదాపు రూ.10 కోట్ల విలువైన ఈ భూములను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఉదాసీ మఠం భూములు

ఆలయ భూములను కాపాడుతాం...

- నవీన్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, నిర్మల్

జిల్లాలోని దేవాదాయ శాఖ పరిధిలో గల విలువైన స్థలాలతో పాటు వ్యవసాయ భూములను కాపాడేందుకు శాఖాపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. బాసరలో సరస్వతి అమ్మవారి ఆలయానికి చెందిన 16 ఎకరాల భూమి కొంత మంది అక్రమాల చెరలో ఉన్నమాట వాస్తవమే. అన్యాక్రాంతమైన ఈ భూమిని కోర్టు ద్వారా పరిష్కరించి తిరిగి ఆలయానికి దక్కేలా చూస్తాం. అలాగే నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉదాసీమఠానికి చెందిన విలువైన స్థలాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.



అడెల్లి మహా పోచమ్మ ఆలయం

పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోళ్లు సాఫీగా సాగేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, మార్కెటింగ్, ప్రణాళిక శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పత్తికొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు మద్దతు ధర (ఎంఎస్‌పీ) కింద తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే పత్తిమార్కెటింగ్ సీజన్ 2025-26లో జిల్లా సగటు దిగుబడి అంచనాకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీ మండలాల వారీగా పత్తిసాగు విస్తీర్ణం, అంచనా ఉత్పత్తి వివరాలు సేకరించి వాస్తవికంగా సగటు దిగుబడిని లెక్కించనుందని తెలిపారు. రాష్ట్ర సగటు కంటే 10 శాతం మించితే ప్రత్యేక ధ్రువీకరణతో మాత్రమే ఆమోదం ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)పై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, సీపీవో జీవరత్నం, ఏడీ మార్కెటింగ్ గజానన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, డీఎస్‌వో రాజేందర్, డీఎం సుధాకర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్ర అధికారులతో సమావేశం

లక్ష్మణచాంద, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరిత బీఎల్‌వోలతో (పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులతో) గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నివేదికకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా 2025 ఓటరు లిస్టులో పేరు నమోదై ఉండి 40 సంవత్సరాలు, ఆ పైన వయస్సు గల ఓటర్లు 2002 ఓటరు లిస్టులో కూడా నమోదై ఉండి ఉంటే ఆ వివరాలను జాబితాగా రూపొందించి తనకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన బీఎల్‌వోలు (పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు) హాజరయ్యారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ట్రస్మాసంఘానికి చెందిన సభ్యులు శ్యామ్‌ప్రకాష్, ముజీబ్ ఖాద్రి అందుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ వారిని సంఘం తరపున సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌ప్రెసిడెంట్ శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు అబ్బాస్, స్టేట్ ఈసీ మెంబర్ షబ్బీర్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌తో ముంపు సమస్యలు

- ఇబ్బందులు తొలగించాలని రామారావ్ పాటిల్ విజ్ఞప్తి



వివరాలు వెల్లడిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

భైంసా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ద్వారా నియోజకవర్గపరిధిలోని గోదావరి నదిపరివాహక ప్రాంతంలో ముంపు సమస్యలు అధికమవుతున్నాయని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఉదయం సంబంధిత విషయంలో ఎమ్మెల్యే రామారావ్ పాటిల్ ఫోన్ ద్వారా మంత్రి జూపల్లితో మాట్లాడి సమస్యను వివరించారు. ఎస్సారెస్పీ వరద గేట్ల ద్వారా నీటి విడుదల జరుగకపోవడం మూలంగా నియోజకవర్గ పరిధిలోని గోదావరి నది పరివాహక ప్రాంతమంతా జలమయమవుతుందని తెలిపారు. పంట చేలన్నీ దెబ్బతింటున్నాయని వివరించారు. బాసర క్షేత్రంలోని పుష్కర ఘాట్లతో పాటు అక్కడి ప్రాంతాలన్నీ బ్యాక్ వాటర్‌తో నిండుకపోయిందని పేర్కొన్నారు. ఇన్‌ఫ్లోకు అనుగుణంగా అక్కడి అధికారులు గేట్ల ద్వారా వరద నీటిని వదిలివేయకపోవడం మూలంగా ఇక్కడి ప్రాంతంలో ముంపు సమస్యలు అధికమవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకవచ్చారు. ఇందుకు మంత్రి జూపల్లి సైతం సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం కోసం సత్వరమే చర్యలు తీసుకోనున్నట్లుగా తెలిపారని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. నియోజకవర్గంలోని భైంసా మండల పరిధిలోని దాబా లింగి నుంచి కుభీర్ మండలం నిగ్వా మీదుగా రాష్ట్ర సరిహద్దులోని దివిశి వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 20కోట్ల నిధులు మంజూరు చేసిందని ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ వెల్లడించారు.

విధుల్లో చేరిన జీపీవోలు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం నూతనంగా నియమించిన గ్రామ పాలన అధికారులు (జీపీవో) తహసీల్దార్ సరిత సమక్షంలో గురువారం విధుల్లో చేరారు. మండలం మొత్తాన్ని పది క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో అధికారిని నియమించారు. కాగా ఒక్కో క్లస్టర్‌లో రెండు నుంచి మూడు గ్రామాలుఉండే అవకాశం ఉంది. క్లస్టర్ల వారీగా లక్ష్మణచాందకు బెల్లిడిగ శ్రీనివాస్, బాబాపూర్‌కు ఒల్లుల గంగాధర్, బోరిగాంకు పబ్బతి నర్సయ్య, చింతల్‌చందాకు బి. రాజన్న, కనకాపూర్‌కు పి. ఈశ్వర్, మల్లాపూర్‌కు రవిమనోహర్, నర్సాపూర్‌కు గొడిసెల పోశన్న, పార్‌పెల్లికి మామిడి రమేష్, వడ్యాల్‌కు జాడి చంద్రశేఖర్, పీచరకు బి.అశోక్‌లు గ్రామ పాలన అధికారులుగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

నేడు మాజీ డిప్యూటీ స్పీకర్ వర్ధంతి

లక్ష్మణచాంద, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిపెల్లి, మల్లాపూర్ గ్రామాల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ దివంగత అయిండ్ల భీమ్‌రెడ్డి వర్ధంతిని శుక్రవారం నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల్లో గల ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన అయిండ్ల భీమ్‌రెడ్డి న్యాయవాదిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించి తెలుగు దేశం పార్టీలో చేరి నిర్మల్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాదేళ్ల బాస్కర్ రావు మంత్రి వర్గంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా పదవులు నిర్వహించి నిర్మల్ అభివృద్ధికి కృషి చేసిన సంగతి అందరికీ తెలిసిందే.

పలుచోట్ల భారీ వర్షం




సదర్మాట్ వద్ద రాతి మత్తడి పైనుంచి దూకుతున్న వరద

ఖానాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో బుధవారం రాత్రి పలుచోట్ల భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఎడతెరిపి లేకుండా కుండపోతగా వాన కురిసింది. ఈ వర్షానికి జిల్లా వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయింది. గడిచిన 24 గంటల్లో జిల్లాలో 18.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. బాసర మండలంలో అత్యధికంగా 99.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. భారీ వర్షం దాటికి ప్రాజెక్టుల్లోకి వరద నీరు పెరుగుతోంది. కడెం ప్రాజెక్టులోకి 5,440 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు ఒక్క వరద గేటును ఎత్తి 7,115 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. మేడంపెల్లి అడవుల్లో గల సదర్మాట్ ఆనకట్ట వద్ద గోదావరిలో వరద భారీగా వస్తోంది. సదర్మాట్ జలకళను సంతరించుకుంది.

గడ్డెన్న ప్రాజెక్టు రెండు వరద గేట్ల ఎత్తివేత

- ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 13,277 క్యూసెక్కులు



సుద్దవాగులోకి విడుదలవుతున్న వరద

భైంసా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీవర్షాల మూలంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి గురువారం వేకువజామున 13,277 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. బుధవారం రాత్రి వరకు 2,754 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా ప్రాజెక్టు అధికారులు వరద గేట్‌ను ఎత్తివేసి దిగువన ఉన్న సుద్దవాగులోకి అంతే మొత్తంలో వరద నీటిని వదిలివేశారు. ఇక బుధవారం అర్ధరాత్రి వేళ నుంచి ఎగువ ప్రాంతంలో వర్షం జోరుగా కురియడంతో గురువారం వేకువజామువేళలో ప్రాజెక్టులోకి వరద నీటిచేరిక క్రమక్రమంగా పెరుగుతూ 6 గంటలకు 11,400 క్యూసెక్కులు, 8గంటలకు 13,277 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో పరిస్థితిని సమీక్షించిన ప్రాజెక్టు అధికారులు ఉదయం 6.10 గంటలకు మరోవరద గేట్‌ను ఎత్తివేసి రెండు వరద గేట్ల ద్వారా ముందుగా 11,400 క్యూసెక్కులు, అటు తర్వాత 13,277 క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు, నీటి సామర్థ్యం 1.83 టీఎంసీలుగా ఉండగా, మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ప్రాజెక్టు నీటిమట్టం 358.6మీటర్లు, 1.77టీఎంసీలు ఉంది. అధికారులు ఇన్‌ఫ్లోకు అనుగుణంగా నీటి విడుదల చేస్తున్నారు.

ఎస్‌బీఐ మోసంపై విచారణ



ఎస్‌బీఐలో కొనసాగుతున్న తనిఖీలు

నర్సాపూర్(జి), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బుధవారం రాత్రి 8:30 నిమిషాల వరకు విచారణ కొనసాగింది. ఆదిలాబాద్ జిల్లా ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ జి.రామచంద్ర రావు, ముగ్గురు చీఫ్ మేనేజర్లతో కలిసి విచారణ జరుపుతున్నారు. నిర్మల్ నుంచి వచ్చిన అప్రైజర్‌తో కలిసి, టచ్‌స్టోన్‌తో పాటు నైట్రిక్ యాసిడ్ ద్రావణాన్ని ఉపయోగించి బంగారు ఆభరణాల నాణ్యతను పరీక్షిస్తున్నారు. బ్యాంకులో రుణం పొందిన 952 నుంచి 980 మంది ఖాతాదారుల ఆభరణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఒక వ్యక్తి తన మిత్రులతో కలిసి బంగారు గాజులు కుదువ పెట్టి బ్యాంకును మోసం చేశాడని గుర్తించారు. ఈ నాణ్యత తనిఖీలు ఇంకా రెండు రోజుల పాటు కొనసాగుతాయని జి.రామచంద్ర రావు తెలిపారు. గతంలో రుణం కట్టి, ఆభరణాలు తీసుకోని ఖాతాదారుల్లో ఉన్న అభద్రతా భావాన్ని ఆయన గుర్తించారు. అలాంటి వారికి వారి బంగారం తిరిగి అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నాలుగు మండలాలకు ఒకే ఎస్‌బీఐ బ్యాంక్ ఉన్నందున ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని ఖాతాదారులు కోరారు.తనిఖీలు పూర్తయిన తర్వాత దోషులపై తగిన చర్యలు తీసుకుంటామని, అలాగే రుణం తిరిగి చెల్లించిన ఖాతాదారులకు వారి బంగారం తిరిగి అందజేస్తామని రీజినల్ మేనేజర్ జి. రామచంద్ర రావు తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు అండగా ఉంటాం

- జిల్లా న్యాయ సేవాసంస్థ కార్యదర్శి రాధిక



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి

సోన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భవిత కేంద్రంలో గురువారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశాన్ని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధిక సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దివ్యాంగ విద్యార్థులకు న్యాయసేవా సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటుందని, తల్లిదండ్రులు ఎవరైనా తమ సమస్యలను వారి దృష్టికి తీసుకురావచ్చని ఆమె సూచించారు. అనంతరం మండల విద్యాధికారి టి. పరమేశ్వర్ రచించిన కుమ్మరిముల్లా పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్థానిక వైద్యాధికారి విజయ్, జిల్లా విలీన విద్య సమన్వయకర్త ఎం. ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆరాధన, స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్రివేణి, ప్రత్యేక ఉపాధ్యాయులు సంధ్యారాణి, స్నేహలత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మికుల ఫిర్యాదులపై కొనసాగుతున్న విచారణ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్, సబ్ కలెక్టర్

భైంసా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాము ఎదుర్కొంటున్న సమస్యలపై మున్సిపల్ కార్మికులు చేసిన ఫిర్యాదుల పర్వంపై విచారణ కొనసాగుతోందని అడిషనల్ కలెక్టర్, భైంసా మున్సిపల్ ప్రత్యేకాధికారి ఫైజాన్‌అహ్మద్ వెల్లడించారు. గురువారం సబ్‌కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్‌తో కలిసి భైంసా మున్సిపల్ కార్యాలయ అవరణలో విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు వేతనాలు తక్కువగా చెల్లించడంతో పాటు పీఎఫ్ ఖాతాల్లో డబ్బులు జమ చేయడం లేదని ఫిర్యాదు చేసినట్లుగా పేర్కొన్నారు. అంతేకాకుండా వేతనాల పెంపుదల కోసం గాను అక్రమంగా డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు చేశారని వెల్లడించారు. వీటన్నింటిపై విచారణకు కలెక్టర్ అభిలాష అభినవ్ భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ చైర్మెన్‌గా హైలెవల్ కమిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. సంబంధిత కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వారం రోజుల వ్యవధిలోగా నివేదిక అందనుందని తెలిపారు. తదనంతరమే తదుపరి చర్యలుంటాయన్నారు. కార్మికులకు ఎలాంటి పరిస్థితుల్లో అన్యాయం జరుగనీయబోమన్నారు. పీఎఫ్ ఖాతాల్లో డబ్బుల జమవిషయమై హైదరాబాద్ కార్యాలయానికి వివరాలు నివేదించామని వివరించారు. క్షేత్రస్థాయి లో పూర్తివివరాలతో విచారణ జరుగుతోందన్నారు. మున్సిపల్ అధికార యంత్రాంగం, సిబ్బంది పనితీరును మార్చుకొని పారదర్శకంగా వ్యవహరించాలని భైంసా బల్దియా ప్రత్యేకాధికారి, జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మూడుగంటల పాటు సబ్‌కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్‌తో కలిసి అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిర్వహణ వ్యవస్థలో మార్పు రాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుధ్యం నిర్వహణ వ్యవస్థ అధ్వానంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో శాఖల వారీగా సమీక్ష నిర్వహించి దిశా, నిర్దేశం చేసినట్లుగా తెలిసింది. ఇందులో మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్‌తో పాటు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన కలప స్వాధీనం

తలమడుగు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాపూర్ గ్రామసమీపంలో గల ఎంఎస్ గార్డెన్‌లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు రూ.85వేల విలువ గల కలపను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. పక్కా సమాచారం మేరకు అటవీశాఖ టాస్క్ ఫోర్స్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవాపూర్ దారిలో గల ఎంఎస్ గార్డెన్‌లో సిబ్బంది తనిఖీ చేయగా కలప దొరికినట్లు తెలిపారు. ఫంక్షన్ హాల్ యజమాని మహమ్మద్, యజమాని మొహమ్మద్ మూసా, లక్షణ్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. తనిఖీలో డీఫైఆర్‌వో కవిత, అమర్ సింగ్, ఎఫ్ఎస్‌వో గులాబ్, అహ్మద్, బీట్ అధికారులు ఉన్నారు.

అధికారులపై దాడిచేసిన వ్యక్తి అరెస్టు

ఇచ్చోడ, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం బీట్ పరిధిలో అటవీశాఖ అధికారులు, పోలీసులపై దాడిచేసిన ఘటనలో ప్రధాన నిందితుడైన షేక్ అల్తాఫ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. 7 కేసుల్లో ప్రధాన నిందితడిగా ఉన్న అల్తాఫ్ ఇన్నిరోజుల వరకు పోలీసుల నుంచి తప్పించుకొని తిరుగుతుండగా గురువారం పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫోర్జరీ కేసులో నలుగురిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ పత్రాలు సృష్టించి భవనాన్ని రిజిస్ట్రేషన్ చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ కే.నాగరాజు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సురేష్ మఖాడియా గంజ్ రోడ్డులో ఆర్సీసీ భవనాన్ని 2002లో కన్నాలాల్ నుంచి కొనుగోలు చేశాడు. కొనుగోలుదారుని ఆధీనంలో భవనం ఉన్నా వినియోగంలో లేకపోవటాన్ని గమనించిన రంగినేని దీపక్ ఫోర్జరీ పత్రాలు సృష్టించి మున్సిపాలిటిలో పన్ను సైతం చెల్లించాడు. అనంతరం రిజిస్ట్రేషన్ అధికారులను తప్పుతోవ పట్టించి తన బావ అయిన నరేంద్ర దీపక్ దడిగెల్వార్ పేరిట 2023లో రిజిస్ట్రేషన్ చేయించాడు. రిజిస్ట్రేషన్‌లో సాక్షులుగా ఆకులవార్ నగేష్, రుకినెవార్ ఆదర్శ్‌లు వ్యవహరించారు. బాధిడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పాఠశాలకు రావాలని ఏఎస్పీకి ఆహ్వానం

ఉట్నూర్, సెప్టెంబరు18 (అంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌ను పాఠశాల హెచ్ఎం చౌహాన్ శీతల్ కోరారు. గురువారం ఆమెను కలిసి ఆహ్వానించారు. ఆమెవెంట ఉపాధ్యాయురాలు రవిత, శ్రీవాణిలు ఉన్నారు.

బోథ్ సమస్యలపై స్పందించిన ఇన్‌చార్జి మంత్రి

బోథ్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఇటీవల పర్యటనలో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోతన్న విన్నవించారు. ఈ నేపథ్యంలో సెంట్రల్ లైటింగ్‌తో పాటు ఆసుపత్రిలో వసతుల కల్పనపై మంత్రి లేఖ రాసినట్లు నాయకులు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణకు

ప్రతీఒక్కరు కృషిచేయాలి: ఎంపీడీవో

బోథ్, సెప్టెంబరు 18 (అంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బాలల పరిరక్షణ కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలల హక్కులపై ఎంపీడీవో మాట్లాడారు. బాలల పరిరక్షణ కమిటీ చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్, డీసీపీయూ సోషల్ వర్కర్ రవికాంత్ ఆధ్వర్యంలో పరిరక్షణ కంపెనీ ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కన్వీనర్‌గా ఉండే ఈ కమిటీలు స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, ఏపీఓ, ఏపీఎం మండల సమాఖ్య అధ్యక్షులు ఎన్జీవో సభ్యులు కిశోర బాలికలు కమిటీ సభ్యులుగా వివరించన్నారు. పిల్లలే బాగా చదువుకునే విధంగా చూడాలని, బడికి రోజూ పంపించాలన్నారు. కార్యక్రమంలో మాసం లక్ష్మీదేవి, సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్, అంగన్‌వాడీఉపాధ్యాయులు కిషోరబాలికలు ఉన్నారు.



మ్యాచ్ గెలిచిన ఆనందంలో ఎస్పీని భుజాన ఎత్తుకున్న పోలీసులు



జట్లకు బహుమతులు అందించిన ఎస్పీ

ఉత్సాహంగా జిల్లాస్థాయి పోలీస్ క్రికెట్ టోర్నమెంట్

» విజేతలకు బహుమతులు అందించిన ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ కోసం 24గంటలు విధులలో నిమగ్నమై ఉండే జిల్లా పోలీసు యంత్రాంగానికి ఆటవిడుపుగా ఉండేందుకు జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ మైదానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న మ్యాచులు గురువారం ముగిశాయి. పోటీలలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తోపాటు పోలీసు అధికారులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. విజేతగా నిలిచిన సూపర్ స్ట్రైకర్స్ జట్టు, రన్నరప్‌గా నిలిచిన ఆదిలాబాద్ రాయల్స్ జట్టుకు ఎస్పీ బహుమతులు అందించారు. జిల్లాపోలీసు యంత్రాం గాన్ని ఏడు బృందాలుగా విభజించి నాలుగు రోజుల పాటు టోర్నమెంట్ నిర్వహించారు. దాదాపు వంద మంది పోలీసు అధికారులు, సిబ్బంది క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అనంతరం ఎస్పీ వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, సీహెచ్ నాగేందర్, కమతం ఇంద్రవర్ధన్, పట్టణ సీఐలు, రిజర్వేఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

'లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి'

బజార్‌హత్నూర్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ మండలసార్ మేడిలు, ఆదివాసీ ప్రజలు గురువారం తహసీల్దార్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం నగేష్, జిల్లా ఆదివాసి ప్రధాన్ అధ్యక్షుడు ఉయిక సుదర్శన్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతాల్లో చొరబడి తమ ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్నారని అన్నారు. సుప్రీం కోర్టు ద్వారా తీర్పు వెలువడే వరకు లంబాడాలకు ఎస్టీ, ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు అందించవద్దని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణలో వారి స్థితిగతులను వెంటనే ప్రభుత్వం సుప్రీం కోర్టుకు నివేదించాలన్నారు. మండలంలోని ఆయా రాయిసెంటర్ గ్రామాల సార్‌మేడిలు, ఆదివాసి ప్రజలు తహసీల్దార్ ఆవరణలో కూర్చుని లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెందూర్ ఈశ్వర్, తొడసం నాగోరావు, మాణిక్ రావు, నైతం రమేష్, బీంరావు, మహిళలు, ఆదివాసి ప్రజలు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

» సీడీపీఓ మాస ఉమాదేవి

ఉట్నూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించాలని ఉట్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ మాస ఉమాదేవి అన్నారు. ఉట్నూర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన పోషణ్ భీ, పడాయి భీ వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నారులకు చక్కగా ఆటపాటలతో విద్య బోధన చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల చిన్నారులలో పౌష్టిక ఆహార లోపం ఉండడంతో ప్రభుత్వం పోషణ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు సైతం పౌష్టిక ఆహారం క్రమం తప్పకుండా అందించాలన్నారు. ప్రభుత్వం నేరుగా అంగన్‌వాడీ కేంద్రాలకు కావాల్సిన సరుకులను, గుడ్లను సైతం సరఫరా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మంజులత, రేవతి,నిర్మల, లక్ష్మి, వందన, చిత్రకళ, పద్మ, పోషణ భీ కోఆర్డినేటర్ పురుషోత్తం పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. భవిష్యత్తు మనదే

» కార్యకర్తలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జాదవ్ అనీల్

బోథ్, సెప్టెంబరు18 (అంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తుగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పార్టీ కార్యకర్తలను ఇప్పటి నుంచే సమాయత్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో రాజకీయ దూకుడు ప్రారంభం కావడంతో కార్యకర్తలపై దృష్టి సారించారు. పార్టీలు మారినంత మాత్రాన ప్రజలు మనల్ని గెలిపించరని, ప్రజల సమస్యలను పరిష్కరించే వారిని, ప్రజాభిమానం ఉన్నవారినే గెలుస్తారని కార్యకర్తలకు చెప్పారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. ప్రజాసమస్యలపై గ్రామాల్లో దృశ్య సారించాలని, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామంలో ప్రజలకు ఉన్న ఇబ్బందులు ఉంటే తన నా దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే భవిష్యత్తులో ప్రజలే తమను ఆదరిస్తారని సూచించారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి

నేరడిగొండ: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. నేరడిగొండ మండలంలోని బుగ్గరం (బి) గ్రామంలో గల గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినిలు హ్యాండ్ బాల్ పోటీల వసతి ఖర్చుల కోసం నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ రాథోడ్‌సజన్, నాయకులు రాథోడ్ సురేందర్ ఉన్నారు.

బెల్ట్ జోరు.. మత్తుతో బేజారు

(5వ పేజీ తరువాయి)

దందాలకు ఎగబడుతున్నారు. ఒక్కో బెల్ట్‌షాపునకు రూ.30 లక్షల నుంచి రూ.50లక్షల వరకు చెల్లించి మరీ టెండర్లను దక్కించుకుంటున్నారు. దీన్ని బట్టి చూస్తుంటే బెల్ట్ షాపుల్లో ఏ స్థాయిలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయో తెలుస్తూనే ఉంది. అలాగే అదనంగా సంబంధిత అధికారులకు నెల నెలా ముడుపులు చెల్లించాల్సిందేనని బెల్టుషాప్ నిర్వాహకులు చెబుతున్నారు. అడ్డగోలుగా దుండుకుంటున్న టెండర్ డబ్బులకు ఎలాంటి లెక్కలు లేకుండానే పోతున్నాయి. కొంత మంది వీడీసీ సభ్యులు తమకున్నా పలుకుబడితో లక్షల రూపాయలు జేబులో వేసుకుంటున్నట్లు తెలుస్తుంది. అయితే కల్తీ మద్యానికి తమ గ్రామస్థుల ప్రాణాపాయ పణంగా పెట్టి డబ్బులు దండుకుంటున్నామనే వాస్తవ విషయాలను వీడిసిలు గ్రహించలేక పోతున్నాయి. యేటా బెల్ట్ షాప్ మద్యానికి బలై ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

బెల్ట్ షాపుల్లో కల్తీ జోరు..

పల్లె, పట్టణం అనే తేడా లేకుండా మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. లిక్కర్ మాఫియా కనుసనల్లోనే బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారు. టెండర్ సొమ్ములో సగం డబ్బులను లిక్కర్ వ్యాపారులే చెల్లిస్తున్నారు. కొంత మంది లిక్కర్ వ్యాపారాలు ధనార్జనే ధ్యేయంగా కల్తీ మద్యాన్ని బెల్ట్ షాపులకు తరలిస్తూ అంటగట్టుతున్నారు. మొత్తానికి కల్తీ కాటుకు బలవుతున్న మందుబాబులను భయంకర వ్యాధులు చుట్టుముట్టి అనారోగ్య బారిన పడతున్నారు. చివరకు వైద్యం కోసం వ్యవసాయ భూములు, ఇళ్లను అమ్మేసుకునే పరిస్థితి ఏర్పడుతోంది. చాలా మంది కుటుంబాల్లో వివాదాలు, గొడవలకు మద్యం మత్తే కారణమవుతుంది. పోలీస్ స్టేషన్‌లకు వస్తున్న కేసుల్లో ఎక్కువగా మద్యం మత్తులో జరిగిన సంఘటనలే ఎక్కువగా ఉంటున్నాయి.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జ్ఞానేంద్రియాలలో ఒకటైన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని, చూపు తక్కువగా ఉన్నవారు అద్దాలు వాడాలని రిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వస్థ్‌నారి స్వశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొని అవగాహన కల్పించారు. 65మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వారిలో 15మందికి కంటి అద్దాలు, ముగ్గురికి కంటి ఆపరేషన్ అవసరమని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారుల డాక్టర్ భీంరావ్, అలేఖ్య, అప్తాల్మిక్ ఆఫీసర్ భాస్కర్ రావ్, హెల్త్ సూపర్ వేజర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు కోసం ప్రత్యేక శిబిరం

ఉట్నూర్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంపూర్ రైతు వేదికలో ప్రత్యేక శిబిరం గురువారం నిర్వహించారు. లక్కెటిపేట, నాగపూర్, శాంపూర్, కామాయిపేట జీపీల పరిధిలోని ప్రజలు సుమారు 500మంది ప్రత్యేక శిబిరానికి చేరుకొని ఉచితకరెంటు, సబ్సిడీ గ్యాస్ పథకాల కోసం తమ పేర్లను ప్రత్యేక శిబిరంలో నమోదు చేయించుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది దినేష్, ప్రకాష్‌లతోపాటు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ జగదీష్ జాదవ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవాతో సత్ఫలితాలు

ఉట్నూర్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవా అవగాహన కార్యక్రమాలతో సత్ఫలితాలు వస్తాయని ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపాల్ రోడ్డ శ్రీనివాస్ అన్నారు. గురువారం స్వచ్ఛత హీ సేవా వారోత్సవంలో భాగంగా నిర్వహించిన అవగాహన పాఠశాలలోకార్యశాల లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామచందర్, జగదీశ్, మధుసూదన్, నాన్సీపోలిన్, సమీరుద్దీన్, సందీప్ పాల్గొన్నారు.

108లో కవలల జననం



అంబులెన్స్‌లో బాలింత

మామడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమల్‌కోట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జామ్లా నాయక్ తండా గ్రామానికి చెందిన సంగీత పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న 108 అంబులెన్స్ ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో నార్మల్ డెలివరీ చేశారు. ఈ కాన్పులో కవల పిల్లలు పాప, బాబు జన్మించారు. తల్లి, ఇద్దరు పిల్లలు క్షేమంగా ఉన్నట్లు 108 ఈఎంటీ సురేష్, పైలట్ ఆఫీజ్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అదృశ్యమైన మహిళ అప్పగింత

దస్తురాబాద్, సెప్టెంబరు 18 (అంధ్రజ్యోతి) : మండలంలోని ఆకొండపేట గ్రామానికి చెందిన జాడి శాంత అనే మహిళను గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే శాంత గత పది సంవత్సరాల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. గత నెల 22న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమె ఆచూకీ కోసం అన్ని పోలీస్ స్టేషన్‌లలో సమాచారం అందించారు. కాగా ఆమె కరీంనగర్‌లో ఉందని తెలుసుకుని, ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వారు తెలిపారు.

కస్తుర్బాలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినిలు

కుంటాల, సెప్టెంబరు, 18 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు కస్తుర్బా బాలికల పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి విద్యార్థులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు



కుంటాలలో కేక్ కట్ చేస్తున్న జిల్లా పరిషత్ మాజీ చైర్మన్

కుంటాల, సెప్టెంబరు, 18 : (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ జుట్టు అశోక్ అన్నారు. ఈ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గత పది సంవత్సముల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క లబ్దిదారునికి కూడా నూతన రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కూడా చేయించలేదని ప్రస్తుతం లేనిపోని ఆరోపణలు చేస్తూ కాలం వెళ్లవెళ్లదీస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ జుట్టు లక్ష్మణ్, మాజీ సర్పంచ్‌లు, జుట్టు మహేందర్, నాయకులు వెంకట్, గోపాల్, తదితరులు ఉన్నారు.

జోర్డాన్‌లో అంబకంటి వాసి మృతి



రవికుమార్ (ఫైల్)

కుంటాల, సెప్టెంబరు, 18 : (ఆంధ్రజ్యోతి) : బతుకు దెరువు కోసం జోర్డాన్ వెళ్లి అక్కడ అనారోగ్యం పాలై తిరిగి వస్తుండగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం మేరకు... కుంటాల మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన గొల్లపల్లి రవి కుమార్ (27) అనే యువకుడు పది సంవత్సరాల క్రితం బతుకు దెరువు కొరకు జోర్డాన్ వెళ్లాడు. అయితే అక్కడ పని చేసి రెండున్నర సంవత్సరాల క్రితం తిరిగివచ్చాడు. పెళ్లి చేసుకొని ఐదునెలల క్రితం మళ్లీ జోర్డాన్ వెళ్లాడు. వెళ్లినప్పటి నుంచి అక్కడ అనారోగ్యానికి గురై పనిచేయలేని పరిస్థితిలో ఉండడంతో ఇటీవల తిరిగి ప్రయాణమయ్యాడు. తిరుగు ప్రయాణంలో షార్జాలో దిగి మరో విమానం ఎక్కాల్సి ఉండగా తీవ్ర అస్వస్థతకు గురైనట్లు ఆసుపత్రికి తరలించగా అక్కడే ఆగస్టు 30న మృతి చెందాడని అక్కడివారు తెలిపారు. కాగా కుటుంబ సభ్యులకు ఆలస్యంగా సమాచారం అందింది. శుక్రవారం స్వగ్రామానికి అతని మృతదేహం రానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. బతుకు దెరువు కోసం దూర దేశానికి వెళ్లి కొడుకు మృత్యువాత పడ్డాడని తెలియడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

అటవీభూమి సాగుచేసిన ట్రాక్టర్ స్వాధీనం

కుంటాల, సెప్టెంబరు, 18 : (అంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని అంబకంటి తండాకు చెందిన ఆడె దత్తురాం, సత్యవన్ అనే ఇద్దరు రాయపాడ్ తండా శివారులో అటవీ భూమిని ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా ఎఫ్ఆర్‌వో రాథోడ్ రమేష్ గురువారం ట్రాక్టర్‌ను స్వాధీనపరుచుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఎఫ్ఆర్‌వో రమేష్, ఎఫ్‌బీవోలు హరిలత, సంజీవ్, డీఆర్‌వో రేష్మలు రాయపాడ్ తండాలో అటవీ భూమి సాగు చేస్తున్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా ఆడె దత్తురాం, సత్యవన్‌లు పరారయ్యారని, ట్రాక్టర్‌ను స్వాధీనపరుచుకొని వారిపై కేసు నమోదు చేశామన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



వీవోఏలకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం రాజేశ్వర్

ముథోల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేద్దామని డీపీఎం రాజేశ్వర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ మండల కేంద్రంలో ముథోల్, బాసర వీవోఏలకు పుస్తక నిర్వహణపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. మహిళలకు జీవనోపాధి పెంపొందించడానికి రుణాలు ఇప్పించి, పేదరికం నుంచి బయట పడే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పెరటి తోటలో మందు లేని కూరగాయలు పండించి కూరగాయలు తినాలన్నారు. అప్పుడు అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు గురుచరణ్, అశోక్, డీఎం జి పోశెట్టి, సీసీలు గోదావరి, లక్ష్మణ్, సాయినాథ్, గంగారెడ్డి, అకౌంటెంట్ సాయినాథ్, ముథోల్, బాసర వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

'మత్తుతో జీవితాలకు ముప్పు'

భైంసా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలకు ముప్పు వాటిల్లుతుందని భైంసాటౌన్ ఎస్సై సుప్రియ, మోటివేషనల్ స్పీకర్ వాడేకర్ లక్ష్మణ్‌లు వెల్లడించారు. గురువారం భైంసాలోని వశిష్ఠ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగంపై కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలను వినియోగించడం ద్వారా జీవితం బుగ్గి పాలవుతుందన్నారు. అనారోగ్యపు సమస్యలు పెరుగుతాయని వారు తెలిపారు. అన్ని విధాలుగా అనర్థాలు అధికమవుతాయని వివరించారు. ఇదే క్రమంలో మత్తు పదార్థాలు రవాణా చేసినా, సేవించినా, విక్రయాలు చేపడుతున్న సంబంధిత సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే

కమ్యూనిటీ కాంటాక్ట్

● భైంసా పట్టణ సీఐ గోపినాథ్



మాట్లాడుతున్న పట్టణ సీఐ గోపినాథ్

భైంసా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకే పోలీసు శాఖ నిరంతరం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తుందని భైంసా పట్టణ సీఐ గోపినాథ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని జుల్ఫేకర్‌గల్లీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. . అసాంఘిక కార్యకలపాల కట్టడి చేసేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో అనుమానితంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కొత్తగా ఇండ్లలో అద్దెకు వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకున్నా తర్వాతే అద్దెలకు ఇవ్వాలని సూచించారు. నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు ఎంతో ముఖ్యమని, ఆ దిశగా ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని కోరారు. డీజే సౌండ్ సిస్టమ్ ద్వారా ఏర్పడుతున్న అనర్థాలను గుర్తించి, దుర్గామాత నిమజ్జనోత్సవ వేడుకల్లో ఆయా మండలిలు వాటిని వినియోగించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఎస్ఐ నవనీత్ రెడ్డి, పోలీసులు జుల్ఫేకర్‌గల్లీ కాలనీ పరిధిలో తనిఖీలు చేపట్టి సరైన పత్రాలు లేని 115 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలు, 2 కార్లను స్వాధీనం చేసుకున్నారు.

చోరీ అయిన పురాతన వస్తువుల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా

సోన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దొంగిలించిన 150 సంవత్సరాల పురాతన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు గురువారం ఏఎస్పీ రాజేష్ మీనా నిర్మల్ సబ్‌డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... సోన్ గ్రామానికి చెందిన శివరాత్రి సేనాపతి గ్రామంలో కూలిపని చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. జల్సాలకు అలవాటు పడిన సేనాపతి మండలంలోని బ్రాహ్మణ కమ్యూనిటీ ఉత్తరాది మఠంలోని అతి పురాతన వస్తువులైన వంట సామాన్లను తాళం పగులగొట్టి గత మార్చి నుంచి ఏప్రిల్ వరకు చోరీ చేశాడని తెలిపారు. పోలీసులు అతడిని విచారించగా నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. దాని విలువ సుమారు లక్షా 90 వేలు అన్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

గౌడ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా

సోన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గౌడ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు టి.గోపి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ గౌడ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్‌కు రాజీనామా పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబ సభ్యులకు సహాయం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన బద్దల చిన్న సాయన్న(28) అలియాస్ తోకల చిన్న సాయిలు ఇటీవల ఆత్మహత్య చేసుకుని మరణించాడు. నాలుగు సంవత్సరాలుగా మద్యానికి బానిసైన అతను జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఫిష్ కట్టర్‌గా పేరున్న సాయన్న మరణంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కుటుంబాన్ని ఆదుకోవడానికి స్నేహితులు ముందుకు వచ్చారు. గురువారం మండల కేంద్రానికి చెందిన 'తెప్ప సంఘం' కార్యదర్శి గాడి ప్రభాకర్, సభ్యులు అశోక్, లక్ష్మణ్, సాయికృష్ణ, పోశెట్టి, బాలు, సాయి, గంగారాంలు సాయన్న కుటుంబాన్ని పరామర్శించి, నిత్యావసర సరుకులు అందజేశారు.

ప్రత్యేక ఆరోగ్య శిబిరం

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం రాంనగర్‌లో గురువారం ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ప్రసూతి వైద్యనిపుణులు డా.విన్నీశ్రీ గర్భిణులకు స్త్రీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు. కిశోర బాలికలు, మహిళలకు పోషకాహారం, రుతుస్రావ సంబంధ పరిశుభ్రతపై కౌన్సెలింగ్, పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. మౌనిక, డా.రమేష్, ఆర్‌బీఎస్‌కే, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ఘనంగా నిమజ్జనం

ఖానాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బుధవారం రాత్రి విశ్వకర్మ స్వామివారి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఖానాపూర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కొమరం భీమ్ చౌరస్తాలోని వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం నుంచి పట్టణ శివారులోని ఉత్తర వాహిని గోదావరి నది తీరం వరకు పట్టణ పుర వీధుల మీదుగా విశ్వకర్మ స్వామివారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ ఊరేగింపులో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. శోభాయాత్రలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఖానాపూర్ సీఐ అజయ్, ఎస్సై రాహుల్ ఆధ్వర్యంలో పోలీసులు పూర్తి భద్రత ఏర్పాట్లను ఈ సందర్భంగా పర్యవేక్షించారు.

పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు



సునీల్ నాయక్

ఇచ్చోడ, సెప్టెంబరు, 18 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని నర్సాపూర్ గ్రామ పంచాయితీలో పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సునీల్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి రమేష్ పేర్కొన్నారు. వచ్చింది ఒకరికి.. కట్టింది మరొకరు అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి డీపీవో స్పందించి ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టారు. వి చారణలో అసలు లబ్ధిదారు కాకుండా మరొక లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రం ఇచ్చినందుకు పంచాయితీ కార్యదర్శిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వి ధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రోడ్ యాప్ క్యూ ఆర్ స్టిక్కర్ ఆవిష్కరణ



క్యూఆర్ స్టిక్కర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

బోథ్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఎమర్జెన్సీ సేవల కోసం క్యూఆర్ యాప్ ద్వారా అత్యవసర సేవలు పొందే వీలుందని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన స్టిక్కర్లను ఆవిష్కరించారు. యూఆర్ ద్వారా సత్వర సేవలు పొందే ఆస్కారం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిస్ట్రిబ్యూటర్ సుగుణాకర్, జిల్లా అడ్వైజర్ రమేష్ ప్రసాద్, గణేష్‌లతో పాటు నాయకులు ఎలుక రాజు, ప్రవీణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి



విద్యార్థులకు పలు సూచనలు ఇస్తున్న మాధ్యమిక విద్యాధికారి

సారంగాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి పరుశురాం అన్నారు. గురువారం మండలంలో గల జూనియర్ కళాశాలను ఆయన పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ముఖ గుర్తింపు హాజరు ఉందని ప్రతి రోజు విద్యార్థులు కళాశాలకు హాజరు కావాలని పేర్కొన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించి వెనకపడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సకాలంలో సెలబస్‌పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజానికి స్ఫూర్తినిచ్చేలా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం ఈ నెల 17 నుంచి మహాత్మ గాంధీ జయంతి అక్టోబర్ 2 వరకు బీజేపీ శ్రేణులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పీఎం నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఖానాపూర్ చెరువు కట్ట వద్ద బతుకమ్మ ఘాట్‌లో గురువారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ శ్రేణులతో కలిసి బతుకమ్మ ఘాట్ వద్ద చెత్త చెదరాన్ని తొలగించారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వాన్ని ప్రపంచమంతా సమర్థిస్తుందని అన్నారు. దేశ ప్రజలందరూ కోరుకున్న విధంగా ప్రపంచానికే భారతదేశ నాయకత్వం వహించాలనే విధంగా ప్రధాని మోదీ నేతృత్వంలో ఆ దిశగా దేశం పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్, నాయకులు గందే విజయ్, గందే కృష్ణ, జోగు రవి, రాజేష్, దినేష్ మాటోలియా, బోయర్ విజయ్, రాజేష్, ప్రవీణ్, వేద వ్యాస్, ముకుంద్ రావు, అశోక్ రెడ్డి, నగేష్ పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బీఆర్ఎస్, బీజేపీల గురించి మాట్లాడడం వృథా: ఎమ్మెల్యే

ఆదిలాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, మరికొన్ని రోజుల్లో కాంగ్రెస్ పని అయిపోతోందని, అలాంటి పార్టీల గురించి మాట్లాడడం సమయం వృథా అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సాత్నాల మండలంలోని జామిని, జగుగూడ గ్రామాల్లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు చేనులో బోరుబావితో పాటు కరెంటు, 90శాతం సబ్సిడీతో పెన్సింగ్ నిర్మాణం చేయాలనేదే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు కరుణాకర్ రెడ్డి సుభాష్ రమేష్ రోహిదాస్ రాము మీరాబాయి రేణుకా బాయి ఆనంద్ రావు అశోక్ రెడ్డి ముకుందరావు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రండి

బాసర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారికి ఆలయంలో ప్రతీ సంవత్సరం వైభవంగా నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మీలలను ఆలయ అధికారులు ఉత్సవాలకు ఆహ్వానించారు. వారి వారి కార్యాలయాల్లో వారిని కలిసి అమ్మవారి ఉత్సవాల ఆహ్వాన ప్రతికను అందించి ఉత్సవాలకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కే. అంజనీదేవి, ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్, అర్చకులు హరీష్‌లున్నారు.



ఎస్పీ, కలెక్టర్‌లను ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో జరుగబోయే శరన్నవరాత్రి ఉత్సవాలకు పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు ఆదేశించారు. గురువారం బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. దసర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉండడంతో క్యూలైన్లు, వీఐపీ క్యూలైన్లు, అక్షరాభ్యాస మండపాలు, దర్శనం, లడ్డు కౌంటర్లు, సీసీటీవీ కెమెరాలు, అన్నదానం, తాగునీరు, వసతి వంటివి పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు అందరు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శరత్‌పాటక్, ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావుపటేల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సబ్ కలెక్టర్ ఆలయ ప్రత్యేక అధికారి సంకేత్‌కుమార్, ఆలయ ఈవో అంజనీదేవి, డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ పవన్ చంద్ర, పోలీసు సిబ్బంది ఉన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పంట చుట్టూ.. చీరకట్టు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల నుంచి పచ్చని పంటను రక్షించుకునేందుకు రైతన్నలు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. జంతువులు పంటలోకి ప్రవేశించకుండా మైకులతో హడలెత్తించడం, రాత్రిళ్లు కాపలాగా ఉండడం చేస్తుంటారు. బజార్ హత్నూర్ మండల శివారులో మొక్కజొన్న ఎదిగే క్రమంలో ఉండగా అడవి జంతువుల నుండి రక్షణగా పాత చీరలను పంట చుట్టూ కట్టి కనిపించాయి.



బజార్‌హత్నూర్ మండల శివారులో మొక్కజొన్న పంటకు చీరలు కట్టిన దృశ్యం



పలు మండలాల లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే జాదవ్

ఆస్పత్రిలో ఖర్చయిన బిల్లులను తీసుకురండి

● ఆర్థిక సాయం అందేలా చూస్తా : ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలు వివిధ రకాల వ్యాధుల బారిన పడి ఆర్థికంగా నష్టపోతే వారి నాదుకునేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని భీంపూర్, బజార్హత్నూర్, బోథ్, గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ, తలమడుగు ఫార్మసీ మండలాల చెందిన ఒక వంద ఐదు మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన వారు ప్రతి బిల్లును తీసుకోవాలని బిల్లలను తమ కార్యాలయానికి తీసుకువచ్చి ఇస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చి ఆర్థిక సాయం అందిన చూస్తామన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు ఇది సందర్భంగా రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని దృక్పథంతో గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఆదాయంలో నాలుగు కోట్ల రూపాయలతో నూతన ఆసుపత్రిని నిర్మించడం జరుగుతుందన్నారు. ఆసుపత్రిలో పరికరాల కొరత విషయమై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు ఇటీవలనే హైదరాబాదులో కమిషనర్‌తో కలిసి ఈసీజీ మిషనరీని మంజూరు చేయాలని కోరమన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ వైస్ ఎంపీపీ డాక్టర్ స్వామి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, పట్టణ అధ్యక్షులు ప్రశాంత్‌తో పాటు నాయకులు చంద్రమోహన్, రఫీ, ఇఫ్తార్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఈసీజీ మిషన్‌కు పేపర్ కొరత

బోథ్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈసీజీ మిషన్ ఉన్న అందుకు అవసరమైన పేపర్ లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదని రాబోతున్నారు. ప్రైవేట్ హాస్పిటల్లోకి నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు బుధవారం సాయంత్రం చాతి నొప్పితో ఆస్పత్రికి వస్తే ఈసీజీ మిషన్ ఉన్న పేపర్ లేకపోవడంతో సరైన రిపోర్టు అందకుండా పోయిందని వాపోయారు అదే రోజు ఆదిలాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లడంతో ఈసీజీ తీసి హార్ట్‌ఎటాక్ వచ్చిందని డాక్టర్లు స్టంట్ వేయడం జరిగిందన్నారు దీంతో స్టంట్ వేసి వైద్యం చేశారని పేర్కొన్నారు ఈ విషయమై గురువారం బోత్ కు చెందిన పలువురు సూపర్డెంట్ రవికుమార్‌ను అడగగా ఈసీజీకి సంబంధించిన పేపర్ లేదని త్వరలో తెప్పిస్తామని పేర్కొన్నారు దీంతో పలువురు పట్టణవాసులు ప్రభుత్వాస్పత్రి తీరుపై అసహనం వ్యక్తపరిచారు.



బోథ్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న గ్రామస్థులు

బతుకమ్మ పాటలతో మహిళల వినూత్న నిరసన



ముక్రా(కె) గ్రామంలో బతుకమ్మతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఇచ్చోడ, సెప్టెంబరు, 18 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో ఆరు గ్యారంటీలు అమలు కాకపాయె ఉయ్యాల్లో అంటూ అడిపాడి మహిళలు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని ముక్రా(కె) గ్రామంలో గురువారం ఆరు గ్యారంటీల ప్లాకార్డులు ముందర పెట్టి బతుకమ్మ ఆడి వినూత్న నిరసనను వ్యక్తపరిచారు. మహలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి మహిళకు 2500 రూపాయలు ఉయ్యాలో.. 4000 ఫించన్ ఉయ్యాలో.. ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం ఉయ్యాల్లో అం టూ పాడుతూ నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి మహిళలను, తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే ప్రజలకు అందేలా చూడాలని ఆ గ్రామ మహిళలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి పాల్గొన్నారు.

'ఆదర్శ' విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

బోథ్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్ విద్యార్థులకు కలుగుతున్న సమస్యలను వి ద్యార్థులు మహిళా సంఘం అధ్యక్షురాలు జ్యోతి గౌడ్ శోభలకు విన్నవించారు. హాస్టల్‌లో రాత్రి పూట పర్యవేక్షణ లేదని, దీంతో హాస్టల్‌లోకి ఎవరు వస్తున్నారు ఎవరు వెళ్తున్నారు తెలియని పరిస్థితి ఉందని విద్యార్థులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేగాక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని కోరారు. దీంతో విద్యార్థుల సమస్యలను విన్న మహిళా సంఘం నాయకులు జిల్లా కలెక్టర్, ఎస్పీ విద్యాధికారులకు వినతిపత్రం సమర్పించారు. హాస్టల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు అందుకు కారకులైన సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని కోరామని వారు పేర్కొన్నారు. దసరా సెలవుల లోపు చర్యలు తీసుకొని విద్యార్థులకు భరోసా కల్పించాలని వారు అధికారులను కోరినట్లు తెలిపారు. లేకుంటే ఆదర్శ పాఠశాల హాస్టల్ మూతపడే ఆస్కారం ఉందని వారు ఆవేదన వ్యక్తపరిచారు.



ఇబ్బందులను మహిళా సంఘ అధ్యక్షురాలికి విన్నవిస్తున్న విద్యార్థులు

విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కంది శ్రీనివాస రెడ్డి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మరాఠి విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో జరిగిన విశ్వకర్మ జయంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విశ్వకర్మల ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయింపు విషయమై కలెక్టర్‌కు సిఫారసు చేస్తానన్నారు. ఆధునిక యంత్రాల కారణంగా వండ్రంగి కులవృత్తులు దూరమయ్యాయన్నారు. స్కిల్ డెవలప్ రీ యింబర్స్‌మెంట్ విషయంలో తగిన ప్రాధాన్యం కల్పించే విషయంలో కృషి చేస్తానని తెలిపారు. అన్నిరంగాల్లో మరాఠి విశ్వకర్మలు అభివృద్ధి చెందాలన్నారు. కులస్థులలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్ రావు, కలాల శ్రీనివాస్, సంజయ్ గుండావార్, మునిగేలా విఠల్, లోక ప్రవీణ్ రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం

- పెరుగుతున్న దాడులు
- నెల రోజుల వ్యవధిలోనే మూడు ఘటనలు
- ఒక్కరోజే ఐదుగురికి గాయాలు



కాలనీలో గుంపుగా తిరుగుతున్న వీధి కుక్కలు

దస్తురాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వీధి కుక్కల సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోంది. రాత్రింబవళ్లు గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు చిన్న పిల్లలతో పాటు పెద్దలకు కూడా భయానకంగా మారుతున్నాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని రాంపూర్, మున్యాల్ గ్రామాల్లో గురువారం ఐదుగురిని కరిచి గాయపరిచాయి. మున్యాల్ గ్రామానికి చెందిన హర్షవర్ధన్, రాంపూర్ గ్రామానికి చెందిన బూస హర్ష, భూత్కూర్ గ్రామానికి చెందిన కాల్వ బాలయ్యను, దస్తురాబాద్ గ్రామానికి చెందిన నిశ్విత్, అయేషాలను వీధి కుక్కలు గాయపరిచాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులు, వృద్ధులు కుక్కల దాడులకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బతుకమ్మ వేడుకలకు ఘనమైన ఏర్పాట్లు చేయాలి

- అధికారులకు మున్నూరు కాపు మిత్ర మండలి విజ్ఞప్తి

భైంసా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో సోమవారం జరుగనున్న బతుకమ్మ వేడుకలకు ఘనమైన ఏర్పాట్లు చేపట్టాలని మున్నూరుకాపు మిత్ర మండలి అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేసింది. గురువారం మిత్ర మండలి అధ్యక్షుడు గాలి రవి నేతృత్వంలో కార్యవర్గ ప్రతినిధుల బృందం మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్‌లను కలిసి వినతి పత్రాలు అందచేశారు. బతుకమ్మల నిమజ్జనం నిర్వహించే గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద విద్యుత్ లైటింగ్ వ్యవస్థ, తాగునీటి వసతి కల్పించాలని కోరారు. అంతేకాకుండా బతుకమ్మ ఘాట్ వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. బతుకమ్మల శోభ యాత్ర కొనసాగే మార్గాన్ని మెరుగుపరచాలని తెలిపారు.ఇక శోభయాత్రలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా, అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. మిత్ర మండలి విజ్ఞప్తులకు అనుగుణంగా చర్యలు చేపడుతామని అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్‌లు వెల్లడించారు. ఇందులో మిత్రమండలి ఉపాధ్యక్షులు రావుల పోశెట్టి, సలహా సంఘం ప్రతినిధి డా. అల్లెం పోశెట్టి, కార్యవర్గ ప్రతినిధులు బందెల శంకర్, మామిడి స్వామి, కారగిరి భూషణ్, ధర్మపురి, ఆకుల రాజేశ్వర్, అల్లెం బాపురావ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్నూరు కాపు ప్రతినిధులు

దత్తాత్రేయ ఆలయ అభివృద్ధి పనులకు నిధులు

- ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ్‌రావ్ పాటిల్

భైంసా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ఆలయాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టి ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లుగా ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ్‌రావ్ పాటిల్ తెలిపారు. గురువారం భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. భైంసా మండలంలోని వాలేగాం దత్తాత్రేయ మందిరంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను రూ. 9.26లక్షల నిధులు మంజూరైనట్లుగా వెల్లడించారు. రూ. 5లక్షలతో ఆలయంలో ఫ్లోరింగ్, విద్యుద్దీకరణ పనుల కోసం, రూ. 4.26లక్షలు ఇనుప గ్రిల్స్, రంగులు వేయడం, ఇతర పనుల కోసం మంజూరైనట్లుగా వివరించారు. ఇదే క్రమంలో భైంసాలోని సంతోషిమాత మందిర పునర్నిర్మాణం, మాటేగాం గ్రామంలోని కొరడి గణపతి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను నిధులు మంజూరు కానున్నాయని పేర్కొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందంతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పాటిల్

బతుకమ్మ సంబరాలకు ఆహ్వానం..

పట్టణంలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరుగనున్న బతుకమ్మ సంబరాలకు రావాల్సిందిగా మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పాటిల్‌కు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కర్రొల్ల బుచ్చయ్య, అధ్యాపక బృందం విజ్ఞప్తి చేసింది. గురువారం ఇక్కడి క్యాంపు కార్యాలయంలో అధ్యాపక బృందం మాజీ ఎమ్మెల్యేను కలిసి కళాశాలకు సంబంధించి పలు సమస్యలను వివరించి పరిష్కరించేందుకు కృషి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కళాశాలలో జరిగే బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలకు చెందిన కెమిస్ట్రీ అసిస్టెం

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

తానూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లోని జెడ్‌పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి గన్నారపు విజయలక్ష్మీ రాష్ట్ర స్థాయి కబడ్డి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిబాబు తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రం నిర్మల్‌లో నిర్వహించిన సబ్ జూనియర్‌కబడ్డి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ నెల 25వ తేదీన నిజామాబాద్ జిల్లా ముప్కల్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆమెను అభినందించారు.

అదనపు ఎస్పీగా కాజల్‌సింగ్‌కు ఉద్యోగోన్నతి



ఉట్నూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కాజల్ సింగ్ అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. రాష్ట్రంలోని పలువురు ఏఎస్పీలకు పదోన్నతులు కల్పించిన ప్రభుత్వం 2021 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కాజల్‌సింగ్‌ను ఉట్నూర్‌లోనే ఏఎస్పీగా బదిలీ చేస్తూ ఉద్యోగోన్నతి కల్పించారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

పేద కుటుంబాలకు అండగా సీఎంఆర్ఎఫ్



చెక్కును అందజేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో మంది పేదలను ఆదుకుంటోందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బోథ్ పట్టణ కేంద్రానికి చెందిన శారదకు సీఎంఆర్ఎఫ్ మంజూరైన కావడంతో గురువారం ఆమెకు రూ.60వేల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ద్వారా అర్హులైన పేదలకు ఆర్థిక సహాయం అందడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయని, ముఖ్యంగా వైద్యరంగంలో అందుబాటులో ఉన్న ఈ సేవలు అనేక కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

బెల్ట్ జోరు.. మత్తుతో బేజారు



జైనథ్‌లోని నిమ్మ గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాప్

- జిల్లాలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- ఎస్పీ ఆదేశాలు బేఖాతర్
- టార్గెట్‌ల పేరిట ఎక్సైజ్‌శాఖ అధికారుల పరోక్ష మద్దతు
- టెండర్‌లు నిర్వహిస్తూ అడ్డగోలుగా దుండుకుంటున్న వీడీసీలు
- గ్రామాల్లో ఏరులై పారుతున్న కల్తీ మద్యం
- అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం

ఆదిలాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లెలు, పట్టణాల్లో విచ్చలవిడిగా సాగుతున్న బెల్ట్ జోరుకు.. మందు బాబులు బేజారవుతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా అడ్డగోలుగా మద్యం విక్రయాలను జరుపుతున్నారు. జిల్లాలో అధికారికంగా 41 వైన్‌షాపులు మాత్రమే ఉండగా అక్రమంగా 2వేలకు పైగా బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలను జరుపుతున్నారు. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసిన తెలియనట్లుగానే వ్యవహరిసున్నారు. నాటు సారా, దేశీదార్ అమ్మకాలపై ఎంతో హడావుడి చేస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు బెల్ట్ షాపుల జోలికి మాత్రం వెళ్లడం లేదంటున్నారు. గతంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కొరడా ఝలిపించడంతో పూర్తిగా సైలెంట్‌పోయిన లిక్కర్ మాఫియా ఆగడాలు మళ్లీ పెరిగిపోతున్నాయి. మున్సిపల్ పరిధిలో గల్లి గల్లికి బెల్ట్ షాపులే కనిపిస్తున్నాయి. గ్రామాల్లో కిరాణా షాపులతో పాటు ఇళ్లలోనూ మద్యం అమ్ముతూ దుండుకుంటున్నారు. బెల్ట్‌షాపుల్లో ఎక్కువగా మద్యం తాగుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు మద్యానికి బానిసలై తీవ్రఅనారోగ్య బారిన పడతున్నారు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.



తలమడుగులోని భరంపూర్‌లో నిర్వహిస్తున్న బెల్ట్ షాప్

అడిగినంత ఇస్తేనే..

మండలాల వారిగా బెల్ట్‌షాప్‌ల జాబితాలను సిద్ధం చేస్తున్న కొంతమంది అధికారులు ప్రతినెలా వసూలు దందాకు ఎగబడుతున్నట్లు తెలుస్తోంది. అడిగినంత ఇస్తేనే సరి.. లేదంటే నిబంధనల పేరిట కొర్రీలు పెట్టడం వేధింపులకు గురిచేయడం పరిపాటి గానే మారుతోంది. కాదు.. కూడదు అంటే కేసులు పెట్టేందుకు వెనకాడడం లేదంటున్నారు. ఒక్కో షాప్ యజమాని నెలకు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు సంబంధిత అధికారులకు ముడుపుల రూపంలో ముట్టచెబుతున్నారు. ప్రభుత్వం విధించే టారెట్ల పేరిట బెల్ట్‌షాపుల్ల మద్యం అమ్మకాలను ఎక్సైజ్ శాఖ అధికారులే ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. హోల్ సేల్‌గా లిక్కర్ షాపుల నుంచి బెల్ట్‌షాపులకు మద్యాన్ని తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. గతంలో బెల్ట్ షాపులపై నిషేధం విధించడంతో కొంతమంది ప్రభుత్వ పెద్దలు బెల్ట్ జోలికి వెళ్లవద్దంటూ జిల్లా అధికారులకు సీరియస్ గా ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితులతో బెల్ట్‌షాపుల వైపు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

లక్షల్లో టెండర్‌లు..

జిల్లాలో వైన్‌షాపుల మాదిరిగానే బెల్ట్‌షాపులకు కూడా టెండర్లను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో వీడీసీలు గ్రామ అభివృద్ధి పేరిట అడ్డగోలు (మిగతా 6వ పేజీలో)



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. పోలీసుల సూచనలు పాటిస్తూ వేడుకలను పూర్తి చేయాలని పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని దుర్గా, శారద దేవి మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిర్వాహకుల అభిప్రాయాలు, సలహాలను స్వీకరించి వారికి అవసరమైన సూచనలు చేశారు. ఈ మేరకు ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ దేవీనవరాత్రి వేడుకలు ప్రశాంతంగా జరిగేల పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు డీజేలకు అనుమతి లేదన్నారు. మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. గణేష్ నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా జరిగాయో అదేవిధంగా సహకారం అందించాలని సూచించారు. భక్తిశ్రద్ధలతో సంప్రదాయాలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, సీఐలు సునీల్ కుమార్, నాగరాజు, స్వామి, ఫణిదర్, ప్రణయ్ కుమార్ పాల్గొన్నారు.



హాజరైన మండపాల నిర్వాహకులు, మహిళలు

ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ఖైదీలు డిఫెన్స్ కౌన్సిల్ ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని చీఫ్‌లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి గంగారం అన్నారు. గురువారం జిల్లా జైలును జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో సందర్శించారు. న్యాయాన్ని పొందే విధానాన్ని ఖైదీలకు వివరించారు. ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అరుగుల అశోక్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఉమేష్‌రావు డోలే, జాదవ్ సంగీత, తిలోత్తమ ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిరికొండ, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ మహేష్ అన్నారు. గురువారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిరికొండ ఆధ్వర్యంలో స్వస్త్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ (ఎస్ఎస్ఎపీ) కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని గంగ పుత్ర కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మహేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఏదైనా వ్యాధికి సంబంధించిన లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలని అన్నారు. అనంతరం పలువురికి రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు జారుబాయి, సుశీల, ఆశా కార్యకర్తలు జ్యోతి, దైవశీల, రమాదేవి, కౌసల్య పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులను కాపాడాలి

ఉట్నూర్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కులను కాపాడాలని జిల్లా రాయిసెంటర్ అధ్యక్షుడు మెస్రం దుర్గు అన్నారు. గురువారం తుడుందెబ్బ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అడ్వకేట్ పెందుర్ ప్రభాకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. న్యాయస్థానాల ద్వారానే ఆదివాసులకు న్యాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా తుడుందెబ్బ అధ్యక్షుడు పేందూర్ దాదిరావు, తుడుం దెబ్బజిల్లా గౌరవ అధ్యక్షుడు పంద్రా జైవంతరావు, ఆదిలాబాద్ జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్/చైర్మన్ సీడం సోనేరావు పటేల్,తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యార్థులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగీత కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎమ్మెల్యేను కలిసిన గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నేతలు

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నూతన కార్యవర్గం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిచైతన్య, ఉపాధ్యక్షులు కేమ రాకేష్‌తోపాటు మిగిలిన కార్యవర్గ సభ్యులను ఆయన శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని, సమస్యల పరిష్కారానికి పాటు పడతామని భరోసా కల్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన ఆదిలాబాద్ అర్బన్ మండలానికి చెందిన ఉపాధ్యాయులను గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు నీలా దేవి, లచ్చిరాం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు సునీల్ చౌహాన్, నవీన్‌యాదవ్, రవీంద్ర, ట్రస్మా ప్రతినిధులు పవన్ నా యక్, సాయిని రవికుమార్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తంరెడ్డికి ఘన నివాళి

మావల, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తంరెడ్డి సంవత్సర విమోకము కార్యక్రమానికి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో మాట్లాడారు. ఆయనవెంట సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



మంత్రితో మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి



సోయం బాపూరావును సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

ఆదివాసీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

- మాజీ ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎంపీ, రాజ్‌గోండ్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాబురావు అన్నారు. గురువారం ఆయన నివాసంలో రాణి దుర్గావతి మహిళ ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కలిసి సోయం బాపూరావుతోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సెడ్మకి ఆనంద్ రావును శాలువాతో సన్మానించారు. అనంతరం తమ సమస్యలు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రాన్ని అందజేశారు. తమ సొసైటీ ద్వారా వెనుకబడిన ఆదివాసీ ప్రజలకోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వం ద్వారా వచ్చే నిధుల నుంచి కొన్ని నిధులను తమ సొసైటీకి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరగా, స్పందించిన సోయం బాపూరావు సమస్యలు పరిష్కరించేలా కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు గేడం జంగుబాయి, ఉయిక తులసి బాయి కుమ్ర అనసూయ, మెస్రం శకుంతల, గేడం లీలావతి, కోట్నక్ తనుబాయి, పెందుర్ యశోద, ఆర్కా రాంబాయి, ఆడె సందుర బాయి వెడ్మ లక్ష్మిబాయి ఉన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఘనమైన ఏర్పాట్లు చేయాలి 7



పూజ చేస్తున్న మాజీ మంత్రి జోగురామన్న

ఘనంగా విశ్వకర్మ జయంతి

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో విశ్వకర్మ మరాఠీ వడ్రంగి సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవా ల్లో భాగంగా శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జోగురామన్న హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మఠాధిపతి శ్రీయోగానంద సరస్వతితో కలిసి పూజాది క్రతువులు నిర్వహించగా సంఘం సభ్యులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈసందర్భంగా జోగురామన్న మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కొండ గణేష్, కమిటీ సభ్యులు సంతోష్, వెంకట్ పాల్గొన్నారు.

కులవృత్తులను కాపాడాలి

ఇచ్చోడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌తో కులవృత్తులు కనుమరుగవుతున్నాయని, ప్రభుత్వాలు కులవృత్తులకు జీవం పోయాలని తెలంగాణ మెదరి మహేంద్ర సంఘం రాష్ట్ర సహాయ ప్రచార కార్యదర్శి పిల్ల నరేష్ కోరారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వర బాంబు అండ్ బల్లిస్ మర్చంట్ వద్ద గురవారం ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కులవృత్తులను కాపాడేందుకు ప్రభుత్వాలు చొరవ తీసుకుని చర్యలు చేపట్టాలని కోరారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

నేరడిగొండ, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఆదిలాబాద్ సీనియర్ బిజినెస్ మేనేజర్ అరుణ్‌కుమార్ పాట్లే అన్నారు. గురువారం మండలంలోని బుగ్గారాం గ్రామంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు స్వయం సహాయక సంఘాలు, వ్యక్తిగత రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లిస్తే వడ్డీ మాఫీతోపాటు ఇతర రుణాలు తీసుకోవచ్చాన్నారు. సమావేశంలో చీఫ్ మేనేజర్ విజిత్ కుమార్ డిక్సిత్, ఫీల్డ్ ఆఫీసర్‌లు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో చెత్త వేస్తే చర్యలు

- ఎంపీడీవో శేఖర్

నేరడిగొండ, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆవరణలో చెత్త, పెంట వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో శేఖర్ అన్నారు. గురువారం మండలంలోని బుగ్గరాం బి గ్రామంలోగల ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో కొందరు తమ పశువుల చెత్తను వేయడంతో పాఠశాల ఉపాధ్యాయులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన చెత్త, పెంట వేస్తే వారిని పిలిపించి వారితోనే తీయించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి సురేష్‌రావ్, హెచ్ఎం రాథోడ్ సునీత, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నేరడిగొండ,సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో గురువారం ఇచ్చోడ మండలంలోని గేర్జామ్ గ్రామానికి చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్, రవి, మనోహర్, గోవర్ధన్, గంగారాం, చంద్రమోహన్, సురేష్, శ్రీదర్, అనిల్, బోజన్న, దీపక్, శ్రీరాములు, లక్ష్మీనారాయణ ఉన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఐటీడీఏ పీవో, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఓపెన్ యూనివర్సిటీ పోస్టర్లను ఆవిష్కరించిన పీవో

ఉట్నూర్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి, ఆదిమగిరిజన విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న ఉచిత విద్య పోస్టర్లను గురువారం ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆదిమ గిరిజన విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోందని అన్నారు. మారుమూల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు ఉచిత విద్యను అందించేందుకు ఓపెన్ వర్సిటీ కేవలం రూ.500 ఫీజుతో డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇవ్వనుందని తెలిపారు. సెప్టెంబరు 26లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యూనివర్సిటీ గత 43 ఏళ్ల నుంచి నాణ్యమైన విద్యనందిస్తుందన్నారు. ఆదివాసులకు విద్యతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉట్నూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని నూతనంగా ప్రారంభించినట్లు తెలిపారు. వివరాలకు 9849955477కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఇచ్చోడ, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సన్ షైన్ పాఠశాలలో జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ జూనియర్, సీనియర్ నెట్‌బాల్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక నిర్వహించినట్లు స్కౌట్ గైడ్ జిల్లా సెక్రటరీ స్వామి తెలిపారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా ఇచ్చోడ ఎస్సై పురుషోత్తం హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడనున్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య సిబ్బంది అరుగుల గణేష్, దొడ సంజయ్, దిశెట్టి రాకేష్, పీఈటీలు సాయిరాం, లక్ష్మి, అనుష తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నేరడిగొండ, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సద్దాం అన్నారు. గురువారం మండల కేంద్రంలోగల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్వస్థ నారి స్వసక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ కోలా ఇందిజ పెడియాట్రిషియన్‌తో కలిసి పాల్గొని మహిళలకు వైద్యసేవలు అందించారు. ప్రతీ గ్రామంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి మహిళల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, జీఎన్ఎం స్వాతి, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, శ్రీనివాస్ రెడ్డి, ఆశా గీతా తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె

- సమ్మెకు సీఐటీయూ మద్దతు
- సమ్మె శిబిరాన్ని సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్‌అంబాజీ



సమ్మెలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు



డీడీ అంబాజీ జాదవ్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగులు

ఉట్నూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న దినసరి ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె ఏడో రోజుకు చేరింది. మ్మెకు సీఐటీయూ మద్దతు తెలిపింది. ఆశ్రమపాఠశాలలో వసతి గృహాల కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, రాష్ట్ర జేఏసీతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఏడు రోజులుగా ఐటీడీఏ ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి గిరిజన సంక్షేమ శాఖ అధికార యంత్రాంగానికి చీమకుట్టి నట్టు లేకపోవడం కార్మికులపట్ల వారికున్న చిత్తశుద్ధి తెలుస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, జిల్లా నాయకులు ఆత్రం సోనేరావ్, సుందర్, వెంకట్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ అవుట్‌సోర్సింగ్ డైలీ వేజ్ యూనియన్ సీఐటీయూ నాయకులు ఆశ్రమం, ఎంకైలాష్, పీ.కపిల్, ఎస్.భాదిరావు, కే.విక్రమ్, పీ.మారుతీ, కమలబాయి, సంగీత, తుల్సా బాయి, 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు బాపురావ్, మాణిక్ రావు పాల్గొన్నారు.

సమ్మె విరమించి విధుల్లో చేయాలి: సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్

ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాన్ని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ గురువారం సందర్శించి మాట్లాడారు. కొంతమంది నాయకులు స్వార్థ రాజకీయాలతో సమ్మె చేయిస్తున్నారని, డిమాండ్లలో ఎక్కువ ఇతర జిల్లాలకు చెందినవి ఉన్నాయని అన్నారు. వేతనాల కోసం రూ.89లక్షలు మంజూరైందని అన్నారు. కొన్నిజిల్లాల్లో వేతనాల చెల్లింపులలో అక్రమాలు జరిగిన నేపథ్యంలో కమిషనర్ ఆదేశాల మేరకు వేతనాలు ఆగాయని, త్వరలోనే పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని చెప్పారు. చిత్తగూడ సాటిలైట్ సెంటర్‌లో పిల్లలు తమ భో జనాలు వండుకుంటున్నారని, విద్యార్థులకు ఇబ్బ ందులు కాకుండా సమ్మె విరమించి విధుల్లో చేరాలని కోరారు. ఆయనవెంట డీడీ కార్యాలయం పరిపాలనాధికారి వేణుమాధవ్‌రెడ్డి ఉన్నారు. సమ్మె శిబిరంలో ఉద్యోగ సంఘాల నాయకులు ఏరుకొండ రాజన్న, బాపురా వు వినతి పత్రం సమర్పించారు.